క్లుప్తంగా

క్రీడా దుస్తులు పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్ రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని వంగపల్లి గ్రామంలోని మహేంద్ర యువసేన ఆధ్వర్యంలో సమకూర్చిన క్రీడా దుస్తులను ఖోఖో క్రీడాకారులకు సోమవారం డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రేపాక స్వామి, అచ్చిన క్రిష్ణస్వామి, యూత్ అధ్యక్షుడు ఎండీ అజ్జు, రేపాక మహేందర్, యడపల్లి మహేష్, శేఖర్, కానుగు బొట్టు రాజు గౌడ్, కప్పల నరేష్, కానుగు అనిల్, మహేష్, దశరథ, రాము తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్

అడ్డగూడూరు : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల పరిధిలోని కోటమర్తి గ్రామానికి చెందిన చల్ల సోమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. రైతు జీవిత బీమా నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు చిత్తలూరి సోమయ్య, జిల్లా నాయకులు పాశం సత్యనారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్ వేముల బిక్షం, చిప్పలపల్లి బాలు, నాయకులు గూడ శ్రీను, తోట వెంకన్న, శీల వెంకన్న, చంద్రమౌళి పాల్గొన్నారు.

డప్పులతో తరలిరావాలి

మోటకొండూర్: ఈ నెల 27న జిల్లా కేంద్రంలో,ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు వేల గొంతుకుల సభలను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్రస్వామి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో డప్పు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంద శంకర్, బొట్ల నర్సింహ్మ, కొల్లూరి స్వామి, ఆడెపు శ్రీనివాస్, కొంపల్లి పరుశురాం, మధు, మహేష్, నరేష్ తదితరులు ఉన్నారు.

డప్పు ప్రదర్శనను విజయవంతం చేయాలి

రాజాపేట : జిల్లా కేంద్రంలో ఈ నెల 27న నిర్వహించనున్న డప్పు పదర్శనను విజయవంతం చేయాలని ఏఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి, జాతీయ నాయకుడు మంద శంకర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం దండోర ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచి అసువులు బాసిన మంద జగన్నాథం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎర్రగుంట ప్రభాకర్, శ్రీను, మోత్కుపల్లి నవీన్, పెద్దోల్ల ప్రభాకర్, బాబు, బాలరాజు, మల్లేశ్, ప్రసాద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ గ్రామానికి చెందిన ఇటమోని బాలరాజు ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం ఆ గ్రామస్తులు రూ. రూ.50వేల సమకూర్చి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బండారు ప్రకాశ్‌రెడ్డి, సన్న నర్సింహ, ఇటమోని నరేందర్, బండారు శేఖర్‌రెడ్డి, సప్పిడి చంద్రశేఖర్‌రెడ్డి, కొండమడుగు ఎల్లస్వామి, బాలమల్లేశ్, శ్రీరాం పాండు, పుట్టపాక వెంకటేశ్, నర్సింహ, నవీన్‌గౌడ్, లక్ష్మణ్ గౌడ్, ఇట్టమోని మహేశ్, గోదాసు శ్రీశైలం, మహేశ్, నార్లకంటి రాంరెడ్డి, వినోద్‌రెడ్డి, శ్రీకాంత్, ఒంటెద్దు ఎల్లయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

మంద జగన్నాథంకు నివాళి

భువనగిరిటౌన్ : పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఎదుట డాక్టర్ మంద జగన్నాథం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దుబ్బ రామకృష్ణ, బట్టు రాంచంద్రయ్య, నాగారం అంజయ్య, జహంగీర్, బండారు రవివర్ధన్, శివలింగం,సుభాష్, కృష్ణ, నర్సింహ, ప్రదీప్ పాల్గొన్నారు.

ముద్దసాని నర్సింహ రెడ్డికి..

వలిగొండ : మండల మొగిలిపాకలో ముద్దసాని నర్సింహా రెడ్డి సంతాప సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి నివాళులర్పించారు. పేదల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. నర్సింహా రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మామిడి వెంకటరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మామిడి సత్తిరెడ్డి, పబ్బు ఎల్లయ్య, మద్రి మోహన్ రెడ్డి, పాశం సత్తిరెడ్డి, గోపాల్, రాచకొండ కృష్ణ, జక్కుల శంకరయ్య,శ్రీలత రమేష్, జక్క నరసింహారెడ్డి, నరసింహ, స్వామి పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని కనుముకుల గ్రామానికి చెందిన దేవరపల్లి మోహన్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోచంపల్లి జెడ్పీహైస్కూల్‌లోని 1996–97 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం మృతుడి ఇద్దరి ఆడపిల్లల పేరిట రూ. 1.26,000 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వలందాస్ రవీంద్ర, వెంకటేశం, భాస్కర్‌రెడ్డి, కేసారం సుధాకర్‌రెడ్డి, పోరెడ్డి మల్లారెడ్డి, లింగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నర్సిరెడ్డి, కొండల్‌రెడ్డి, దయానంద్, కృష్ణ, శేఖర్‌రెడ్డి, ధనుంజయ్, వనం అరవింద్, బాలరాజు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన భోగి సంబరాలు

జిల్లావ్యాప్తంగా సోమవారం భోగి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇళ్ల ముందు మహిళలు రంగురంగుల ముగ్గులు వేశారు. ముగ్గుల్లో గొబ్బెమ్మలను పెట్టి రేగి పండ్లు, నవ ధాన్యాలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. అనంతరం భోగి మంటలు వేశారు. గంగిరెద్దులు ఇళ్ల ముందుకు వచ్చి సందడి చేశాయి. యువకులు పతంగులు ఎగురవేశారు. – సాక్షి నెట్‌వర్క్



యాదగిరిగుట్ట : భోగి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



భువనగిరి టౌన్ : భోగి మంట వేస్తున్న గాంధీనగర్ వాసులు



మోటకొండూర్: చందేపల్లిలో భోగి మంటలు వేస్తున్న గ్రామస్తులు



రామన్నపేట: నీర్నెములలో..



ఆలేరురూరల్ : భోగి మంట వేస్తున్న యువకులు



రామన్నపేటలో గంగిరెద్దుకు పూజ చేస్తున్న మహిళ



భువనగిరి : బీఎన్ తిమ్మాపురంలో..



ఆత్మకూరు(ఎం): పతంగులతో చిన్నారులు



యాదగిరిగుట్ట : శ్రీరాంనగర్‌లో ..



మోత్కూరు : పతంగులు కొనుగోలు చేస్తున్న చిన్నారులు



రామన్నపేటలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న మహిళ



మోటకొండూర్ : పంతంగులు ఎగురవేస్తున్న యువకులు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

భువనగిరిటౌన్ : పట్టణంలోని అర్బన్ కాలనీలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ. సలీం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. క్రీడా ప్రాంగాణాలలో అన్నిరకాల క్రీడలకు సంబంధించిన కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ హమీద్ పాష, షేక్ రియాజ్, సాజిద్, తరుణ్,శివ, సోహేల్, నేహాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ

భూదాన్‌పోచంపల్లి : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని భీమనపల్లి గ్రామంలో గ్రామ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భీమనపల్లి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కొత్త పర్వతరెడ్డి, అధ్యక్షుడు అనిరెడ్డి జగన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కర్నాటి పాండు, ఉపాధ్యక్షులు వడ్డేమోని వెంకటేశం, ఈరటి మల్లేశం, కార్యదర్శి జైపాల్‌రెడ్డి, యాట కైలాసం, సిలివేరు శేఖర్, బద్దం లక్ష్మారెడ్డి, ఆదిమూలం శ్రీను, గంగదేవి రాజు, కొత్త శంభారెడ్డి, మేకల కృష్ణ, మద్రి రాజిరెడ్డి, ఎడ్మ చంద్రవాసురెడ్డి, కొండల్‌రెడ్డి, రాంరెడ్డి, కట్కూరి పాండు, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీశైలం, సాయిలు, జమ్ముల జంగారెడ్డి పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ గ్రామంలో పోచంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శీతాకాల శిబిరం సోమవారం కొనసాగింది. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వయోజనులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రొగ్రామ్ కో ఆర్డినేటర్లు దుర్గం సాయివర్ధన్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ముగ్గులు ప్రతీక



బొమ్మలరామారం : ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



భువనగిరి : ముగ్గులను పరిశీలిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు



చౌటుప్పల్ రూరల్: జైకేసారంలో..

చౌటుప్పల్ : సంస్కృతి, సంప్రదాయాలకు ముగ్గులు ప్రతీక అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు అన్నారు. పట్టణ కేంద్రంలోని ఖచ్చీరు వద్ద సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాల భూపాల్‌రెడ్డి, బడుగు శ్రీరాములు, గోశిక భిక్షపతి, దాసోజు భిక్షమాచారి, గోశిక పురుషోత్తం, కడారి కల్పన, వనం ధనుంజయ్య, గోశిక ధనుంజయ్య, తడక సురేఖ, గోశిక నీరజ, చింతకింది అంజయ్య, వరగంటి బోవయ్య, చింతకింది కిశోర్, సోమ నాగలింగం, చింతకింది సంపత్, కిరణ్, ప్రవీణ్, మహేష్, నందు, నవీన్, హరీష్, పోలోజు వినయ్, వెంకటేష్, నరహరి పాల్గొన్నారు. 16వ వార్డులో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గల పోటీలను పలువురు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి, దాసు, ఖయ్యూంపాష, జయమ్మ, అండాలు, సోమరాజు, వీరమళ్ల యాదయ్య, జానీ, బాబు, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

భువనగిరి : పట్టణ కేంద్రంలో సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి, జననీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పడమటి జగన్మోహన్‌రెడ్డి, గడ్డం జ్ఞానప్రకాష్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఆగేశ్వర్ రావు,దేవేందర్, కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, ఉడుత భాస్కర్, వైజయంతి పాల్గొన్నారు. అదే విధంగా వాసవీ క్లబ్ ఆఫ్ భువనగిరి ఆధ్వర్యంలో పట్టణంలోని జీనియస్ హైస్కూల్ లో ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ విజయలక్ష్మి, కృష్ణమూర్తి శబరినాథ్, ప్రభాకర్, సోమన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భువనగిరిటౌన్ : భువనగిరి పట్టణ కేంద్రంలో ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బట్టుపల్లి శ్రీనివాస్, ఉదయగిరి శ్రీనివాస్ జ్ఞాపకార్థం సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, కల్లూరి నాగమణి, గంధ మల్ల బాలమణి ,అంబటి లలిత తదితరులు ఉన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని పుట్టపాక గ్రామంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వాల ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎస్ఐ జగన్, ఎంఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎంపీటీసీ మద్రి వసంతనర్సిరెడ్డిలు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వర్కాల చంద్రశేఖర్, దొంతగోని పెద్దులు, పిట్ట రాములు, గాలయ్య, శ్రీకాంత్,అంజయ్య, జయమ్మ, బాలయ్య, యాదయ్య, యాదవరెడ్డి, అమరేందర్, మహష్ తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ రూరల్ : చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు.

రామన్నపేట : మండలకేంద్రంతో పాటు వెల్లంకి గ్రామంలో సోమవారం డీవైఎఫ్ఐ , ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పల్లె మధుక్రిష్ణ విజేతలకు బహుమతులను అందజేశారు. కొమ్మాయిగూడెంలో ఆదర్శయూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు అంతటి నర్సింహ, ఎర్ర శేఖర్‌గౌడ్, వీరమల్ల రామలక్ష్మయ్యలు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వల్లందాసు కృష్ణ, హన్మంత్, మునుకుంట్ల లెనిన్, ఆవనగంటి నాగేష్, ఎర్రోళ్ల నర్సింహ, కర్రె సంతోష్, తాటిపాముల మహేష్, రాపోలు కుమార్, కన్నెబోయిన రాజలింగం పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండలంలోని లింగరాజుపల్లి, రహీంఖాన్‌పేట, పారుపల్లి, సింగారం గ్రామాల్లో సోమవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. మండల కేంద్రంలో నేతాజీ యువజన మండలి, శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో వేర్వేరుగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పి. శ్యంతన్‌రాజు, మజ్జిగ నరేష్, వెలిమినేటి మురళీకృష్ణ, మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, మాజీ ఎంపీటీసీ యాస కవిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్, రచ్చ గోవర్ధన్ పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండలంలోని ఫక్కీరుగూడెంలో పంచాయతీ అవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని ఇంద్రియాల గ్రామంలో సోమవారం క్రాంతి యూత్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు గడ్డం శ్రీనివాస్‌గౌడ్, ఎర్ర వెంకటేశ్‌గౌడ్ బహుమతులను అందజేశారు.భీమనపల్లి గ్రామంలో గ్రామ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. వంకమామిడి గ్రామంలో 2008–09 ఎస్సెస్సీ బ్యాచ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ హిందిపండిట్ జి. వెంకటేశ్వర్లు, సత్యం, మాజీసర్పంచ్ బొడిగె శంకరయ్య, సుర్వి సత్యనారాయణ, బొడిగె శివ, ప్రియాంక, చందు, సతీష్, బాలు, మమత, సంతోష్ ,శంకర్, పరమేశ్ పాల్గొన్నారు.



ఆత్మకూరు(ఎం) : ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న నాయకులు



రామన్నపేట : విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

వైభవంగా గోదా దేవి కల్యాణ మహోత్సవం

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని కనుముకుల గ్రామంలోని శ్రీ గోదాదేవి పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం గోదాదేవి రంగనాథుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దంపతులు, దేవాలయ నిర్మాణ ధర్మకర్తలు కోట పుష్పలత మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కోట అంజిరెడ్డి, ఉపసర్పంచ్ పాక నర్సింహ పాల్గొన్నారు. పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో రాత్రి మాజీ వైస్ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, కవిత దంపతుల సౌజన్యంతో శ్రీ రంగనాయకస్వామి, గోదాదేవి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ అంకం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గోదా రంగనాథస్వామి కళ్యాణ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత ఎగమాటి రాంరెడ్డి, అరుణ దంపతులు, ముప్పా వెంకట్‌రెడ్డి, కొప్పుల కరుణాకర్‌రెడ్డి, ఆమనగంటి వెంకట్‌రెడ్డి , సూరోజు భాస్కరాచారియాదమ్మ, సోలిపురం చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని రఘునాథపురం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి, రేణికుంట పరిధిలోని సకల్పసిద్ధి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో సోమవారం శ్రీ గోదాదేవి రంగనాథుల కళ్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

గుండాల : మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాథస్వామి కళ్యాణ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవనబోయిన భార్గవి, అయిలయ్య, అట్ల విష్ణువర్ధన్‌రెడ్డి, సునీత, ఉపేంద్రాచారి, ఎస్.యాదగిరి, సురేందర్, బాలలింగం, వెంకటలక్ష్మి, నాగరాజు పాల్గొన్నారు.

గుండాల : మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో గోదా రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవనబోయిన భార్గవి, అయిలయ్య, అట్ల విష్ణువర్ధన్‌రెడ్డి, సునీత, ఉపేంద్రాచారి, ఎస్.యాదగిరి, సురేందర్, బాలలింగం, వెంకటలక్ష్మి, నాగరాజు పాల్గొన్నారు.

రామన్నపేట : రామన్నపేట, సిరిపురం గ్రామాల్లో శ్రీ గోదాదేవి రంగనాథస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలను సోమవారం కనులపండువగా నిర్వహించారు. వేడుకల్లో ఆలయ చైర్మన్లు లవనం ఉపేందర్, కట్ట దశరథరెడ్డి, నాయకులు గంగుల వెంకటరాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, బత్తుల క్రిష్ణగౌడ్, జెల్ల వెంకటేశం, రామిని రమేష్, ముక్కాముల దుర్గయ్య, రాపోలు రాజశేఖర్, వనం అంజయ్య, ఖైరబోయిన లక్ష్మన్, కోట సుధాకర్, కొమ్ము శేఖర్, కోట విజయ వెంకన్న, బట్టి సంతోష్‌కుమార్, బోయపల్లి యాదయ్య పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లి : కనుముకుల గ్రామంలో గోదాదేవి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



మోత్కూరు : గోదా రంగనాథస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



వలిగొండ : గోదా రంగనాథస్వామి స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు



గుండాల : గోదా దేవి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



రామన్నపేట : భక్తులకు తాళిబొట్టు చూపిస్తున్న అర్చకులు



రాజాపేట : గోదాదేవి కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలోని శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో సోమవారం గోదారంగనాథ స్వాముల కల్యాణ మహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవ వేడుకలకు దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డి, దేవాలయ కార్యనిర్వాహణ అధికారి మోహన్ బాబు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. జంగారెడ్డిపల్లికి చెందిన బద్దం పుల్లారెడ్డి దంపతులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వాటికి అనంతరెడ్డి, నూతి రమేష్, ధర్మకర్తలు, వేదపండితులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

మోత్కూరు : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని మళ్లీ గెలిపించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముక్కెర్ల యాదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు అన్నారు. సోమవారం మోత్కూరు మండల కేంద్రంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నర్సిరెడ్డి గెలుపు ప్రస్తుత సమయంలో విద్యా రంగానికి ఎంతో అవసరమన్నారు. ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత అమర జీవి మైనేని వెంకటరత్నం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు(ఎం), ఎల్లయ్య, దర్శనం వెంకన్న, అన్నారం సత్తయ్య, వెంకటేశ్వర్లు, దడిపల్లి శ్రీను, యామగాని బుగ్గయ్య, తొర్ర ఉప్పలయ్య, మాతంగి అశోక్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఊరేగింపు

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని శ్రీ అయ్యప్పస్వామి భక్త సమాజం ఆధ్వర్యంలో సోమవారం మకర విలక్కు పురస్కరించుకొని శ్రీ అయ్యప్పస్వామి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. పూలతో అలంకరించిన రథంలో స్వామిని ప్రతిష్ఠించి నాదస్వర, డప్పువాయిద్యాల మధ్య పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో భక్త సమాజం నాయకులు రాపోలు రాంచంద్రం, రేపాక జగన్‌గుప్త, తండ వెంకటేశం, బొడిగె లింగం గౌడ్, గుండు శ్రీరాములు, తండ రమేశ్, అంకం మురళి, దోర్నాల గణేశ్, తండ నాగేశ్, చింతల ప్రకాశ్, ఆడెపు అరవింద్, ఆకుల రాజు, పగిడిమర్రి రాజు, బొడిగె చిన్నలింగం, అశోక్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

ఆలేరురూరల్ : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ అన్నారు. సోమవారం ఆలేరు పట్టణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చౌడబోయిన కనకయ్య, పరుశరాములు, రవి, ఆంజనేయులు మల్లయ్య, శ్రీనివాస్, మహేందర్, కనకయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్తక సంఘాన్ని రాజకీయాల్లోకి లాగొద్దు



మాట్లాడుతున్న గడ్డమీది మాధవులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయ సన్నిధిలో జీవనోపాధి పొందుతున్న వర్తక సంఘాన్ని రాజకీయాల్లోకి లాగొద్దని వర్తక వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు గడ్డమీది మాధవులుగౌడ్, గౌరవ అధ్యక్షుడు కొన్నె రమేష్ అన్నారు. యాదగిరిగుట్టలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యేకు పదిహేను దుకాణాల కోసం డబ్బులు ఇచ్చామని ఇటీవల బీఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. వర్తక సంఘం అభివృద్ధికి అన్ని సంఘాలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, ఉపాధ్యక్షుడు గుజ్జ శ్రీనివాస్, వెంకటేష్, కీసరి బాలరాజు, కోశాధికారి గుండ్లపల్లి నర్సింహ, భాను, కలకుంట్ల శేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

భోగ భాగ్యాలతో రాష్ట్రం సుభిక్షంగా వెలుగొందాలి

• మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



భానుపురి (సూర్యాపేట): భోగ భాగ్యాలతో రాష్ట్రం సుభిక్షంగా వెలుగొందాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలను సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు సంక్రాంతి పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలని అన్నారు. రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో ముందెన్నడూ లేని రీతిలో ధాన్యం దిగుబడి సాధించడం సంవత్సర కాలంలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధికి ప్రతీక అని అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి అని చెప్పడానికి భారతదేశంలోనే తెలంగాణ రైతాంగం 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించడం అద్దం పడుతుందన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రాజెక్టుల నిర్మాణాలను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నామన్నారు. రూ.5,000 కోట్ల అంచనా వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పాఠశాలలు నెలకొల్పుతున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కామన్ డైట్ ప్రవేశపెట్టడంతో పాటు ఏకకాలంలో 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మొటిక్ చార్జీలు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



చెక్కు అందజేస్తున్న దాత తుత్కు శ్రీనివాసరావు, ప్రీతి దంపతులు

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని అంగడి బజార్‌లో గల సీతారామాంజనేయస్వామి దేవాలయ అభివృద్ధి కోసం స్థానికులైన తూత్కు శ్రీనివాసరావు, ప్రీతి దంపతులు రూ.1,11,111 విరాళం ప్రకటించారు. దీనికి సంబంధించిన చెక్కును సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత చేతుల మీదుగా ఆలయ అర్చకుడు పారునంది సూరిబాబుశర్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు పోలినేని ఆనందమ్మ, స్వామిరాయుడు, కె. నర్సిరెడ్డి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం వాసి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



చెంచులకు దుప్పట్లు అందజేస్తున్న నేపాల్ దేశ మంత్రి ముద్వి, రమేశ్‌చందర్‌రెడ్డి

శాలిగౌరారం: మండల పరిధిలోని తిరుమలరాయునిగూడెం గ్రామానికి చెందిన ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ రాష్ట్ర సంఘటన్ అధ్యక్షుడు చాడ రమేశ్‌చందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం శ్రీశైలంలో చెంచు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు నేపాల్ దేశ మంత్రి అనితాసాహు ముద్వి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంక్రాంతి సంబరాలు నిర్వహించి నాగరికతకు దూరంగా ఉన్న చెంచులను గౌరవించడం అభినందనీయమన్నారు. చెంచులకు విల్లంబుల(బాణాలు) పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం చెంచు మహిళలకు చీర-సారెతో పాటు బెడ్‌షీట్లు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు అందజేసి సహపంక్తి భోజనం చేశారు.

అభివృద్ధి పేరిట దోపిడీ

• చేయని పనులకు నిధులు డ్రా
• కొద్దిరోజుల్లో ముగియనున్న మున్సిపల్ పాలకవర్గం



మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయం

మిర్యాలగూడ: రాష్ట్రంలోనే గ్రేడ్-1 మున్సిపాలిటీగా ఉన్న మిర్యాలగూడ మున్సిపాలిటీలో అవినీతి రాజ్యమేలుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీలో కోట్ల రూపాయల అవినీతి జరిగినట్లు ప్రచారం నడుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీకి సంబంధించిన కీలక ప్రజాప్రతినిధి అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతి పనికి ఒక రేటు నిర్ణయించి డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను పక్కదారి పట్టించి తమ ఖాతాల్లో వేసుకున్నట్లు విస్తృత ప్రచారం నడుస్తోంది. గతంలో మున్సిపల్ కమిషనర్ లేని సమయంలో నాలుగు నెలల పాటు ఓ ఉన్నతాధికారికి ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు ఇచ్చారు. ఆ సమయంలో మున్సిపల్ పాలకవర్గం ఆమోదం లేకుండానే పట్టణంలో రోడ్లు, డ్రెయినేజీ, ఇతర అభివృద్ధి పనులు చేయకుండానే సుమారు రూ.21కోట్లను స్వాహా చేసినట్లు తెలుస్తోంది. దీంతో పాటు విద్యుత్, శానిటేషన్, వెంచర్ల అనుమతి కోసం పెద్దఎత్తున అవినీతి జరిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అనుమతి లేని భవనాలకు సంబంధించి కూడా అవినీతి జరిగినట్లు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేయడం చర్చనీయాంశంగా మారింది.

విచారణ జరిగేనా..?

రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, స్థానిక ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో గతంలో కీలకంగా పనిచేసిన ప్రజాప్రతినిధి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో మున్సిపల్ పాలకవర్గం గడువు ముగియనుండడంతో ఈ అవినీతిపై విచారణ జరిపి నిజాలు వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నా దృష్టికి రాలేదు

మిర్యాలగూడ మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై మున్సిపల్ కమిషనర్ ఎండీ యూసుఫ్‌ను ఫోన్‌లో వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదని పేర్కొన్నారు. అప్పట్లో ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న ఆమెనే అడగండంటూ సలహా ఇచ్చారు.

స్వర్ణగిరి క్షేత్రంలో స్పీకర్ పూజలు



పూజలు చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రాన్ని సోమవారం రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సందర్శించారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వారం ద్వారా వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు మానేపల్లి రామారావు, మురళీకృష్ణ, గోపీకృష్ణ ఆయనకు స్వాగతం పలికారు. స్పీకర్‌ను సన్మానించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

ఇకనైనా కదులుతారా..!

• ప్రభుత్వ భూముల రక్షణ బాధ్యత అధికారులదే
• అడుగు ఆక్రమణకు గురైనా చర్యలుంటాయన్న కలెక్టర్
• కోదాడలో వందల ఎకరాలు అన్యాక్రాంతం
• లావుణి పట్టాలతో సమర్పించారు
• పట్టించుకోని రెవెన్యూ అధికారులు



సర్వే నంబర్ 39ని సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

కోదాడ: 'ప్రభుత్వ భూములు ఒక ఇంచు ఆక్రమణకు గురైనా సహించేది లేదు. ప్రభుత్వ భూముల రక్షణ బాధ్యత అధికారులదే. ఈ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకొని భూములను రక్షించాలి. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు' ఇది ఈ నెల 3వ తేదీన సూర్యాపేటలో జరిగిన సమావేశంలో రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ చేసిన హెచ్చరిక. కానీ కోదాడ రెవెన్యూ డివిజన్‌లో మాత్రం కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇదేమిటంటే వారు కోర్టుకు పోయారని సమాధానం ఇవ్వడం పరిపాటిగా మారింది. ప్రభుత్వ భూమిని అక్రమించుకోవడం నేరం.. నేరం చేసినవాళ్లు న్యాయం కోసం కోర్టుకు ఏలా వెళ్తారన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న. తాజాగా కలెక్టర్ ఆదేశాలతో నైనా కోదాడ డివిజన్‌లో ఉన్న రెవెన్యూఅధికారులు ప్రభుత్వ భూములను రక్షించడానికి ముందుకు వస్తారో లేదో చూడాలి.

కోట్ల విలువైన భూములను ఆక్రమించారు..

కోదాడ పరిసర ప్రాంతాలలో కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడం, అధికారులు పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పడం ఆ తర్వాత తెర వెనుక మంత్రాంగం నడిపి వ్యవహారాన్ని అటకెక్కించడం షరా మాములుగా మారిపోయింది. కొంత మంది రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులతో కుమ్మక్కై కోర్టుకు వెళ్లమని చెప్పడం, కోర్టు అధికారులను వివరణ అడగడం.. సంవత్సరాలైన అధికారులు బదులు ఇవ్వకపోవడంతో సదరు భూమిపై ఆక్రమణదారులకు అనుకూలంగా తీర్పులు రావడం పరిపాటిగా మారింది. కోదాడ పట్టణ సమీపంలో తమ్మర రెవెన్యూలో సర్వే నంబర్ 39లో 42 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో 14 ఎకరాలను పేదలకు అసైన్ చేయగా అక్కడ ఇంకా 28 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి ఆక్రమణ గురైందని కొందరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అక్టోబర్ 2023న అప్పటి జిల్లా కలెక్టర్ పూర్తి సర్వేకు ఆదేశించారు. సర్వే చేసిన అధికారులు రిపోర్టు కూడా ఇచ్చారు. కాని ఆ తర్వాత ఎందుకోకాని దాన్ని అటకెక్కించారు. దీని విలువ ప్రస్తుతం రు. 50 కోట్ల పైమాటే. ఇక విజయవాడ-హైదరాబాద్ బైపాస్ రోడ్డుకు సమీపంలో ఉన్న సర్వే నంబర్ 635లో 31 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో 7 ఎకరాలను అసైన్ చేయగా 24 ఎకరాల భూమి ఉండాలి. కాని ఇక్కడ గజం భూమి లేకుండా ఆక్రమణకు గురైంది. కొందరు రెవెన్యూ అధికారులు లావుణి పట్టాల పేరుతో ప్రభుత్వ భూమి రాసిచ్చినట్లు ఆరోపణలున్నాయి.

కంచె వేసినా కాపాడలేకపోతున్నారు..

కొమరబండ వై జంక్షన్ వద్ద సర్వే నంబర్ 48/3ఏ/1, 48/3బీ/1లో ప్రభుత్వానికి చెందిన 1.08 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అనేక సంవత్సరాలుగా అది పాడుపడి ఉంది. గత సంవత్సరం దీన్ని కొంతమంది ఆక్రమించడానికి ప్రయత్నించగా స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు దాన్ని చుట్టూ ఫెన్సింగ్ వేసి అది ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేశారు. కాని కొందరు ఆ బోర్డును తొలగించి ఫెన్సింగ్‌ను పాక్షికంగా ధ్వంసం చేశారు. ఐనప్పటికి అధికారులు దాని గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇదే సమయంలో కొందరు అది తమ భూమి అని కోర్టుకు వెళ్లినట్లు సమాచారం. దీనికి కౌంటర్ దాఖలు చేసారో.. లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు అంటున్నారు.

క్ర.సం.	సర్వే నంబర్	ప్రభుత్వభూమి	అసైన్ చేసింది	ఆక్రమణ	విలువ
1.	39	42 ఎకరాలు	14 ఎకరాలు	28 ఎకరాలు	రూ.50 కోట్లు
2.	635	31 ఎకరాలు	7 ఎకరాలు	24 ఎకరాలు	రూ.50 కోట్లు
3.	48/3ఏ/1 48/3బీ/1	1.08 ఎకరాలు	నిల్	1.08 ఎకరాలు	రూ.2కోట్లు

పదిసార్లు ఫిర్యాదు చేశా



తమ్మరబండపాలెం పరిధిలో సర్వే నంబర్ 39లో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. భూస్వాములు ఆక్రమించారు. దీనిపై తహసీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు పదిసార్లు ఫిర్యాదు చేశా. సర్వే చేయమని కలెక్టర్ ఆదేశించినా స్థానిక అధికారులు మమా అనిపిస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో సర్వే చేసి అర్హులైన పేదలకు అక్కడ పట్టాలు ఇవ్వాలి.

– కనగాల జనార్దన్‌రావు, తమ్మర

కోర్టు తీర్పు రావాల్సి ఉంది

కొమరబండ వై జంక్షన్ వద్ద ఉన్న భూమి ప్రభుత్వానిదే. దీనిపై కొందరు కోర్టుకు వెళ్లారు. మేము కౌంటర్ దాఖలు చేశాం. తీర్పు రావాల్సి ఉంది. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాము. సర్వే నంబర్ 39, సర్వే నంబర్ 635పై కూడ విచారణ చేస్తాం.

– సూర్యానారాయణ, కోదాడ ఆర్డీఓ

ఆత్మీయ భరోసా అమలుకు వేగంగా అడుగులు

• సంక్రాంతి తర్వాత లబ్ధిదారుల గుర్తింపు
• 26వ తేదీ నుంచి డబ్బులు జమ చేయనున్న ప్రభుత్వం



ఉపాధి పనుల్లో నిమగ్నమైన కూలీలు

రామన్నపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏటా రూ.12వేల ఆర్థికసాయం అందించాలని నిర్ణయించింది. ఈ నెల 4వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ పథకం అమలు చేయాలనే కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలో సుమారు పన్నెండు లక్షల కుటుంబాలకు రెండు విడతల్లో నగదు బదిలీ చేయడం జరుగుతుంది. ఈ నెల 10న పథకం అమలు, లబ్ధిదారుల అర్హత, ఎంపికకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ప్రకటించింది. పథకం అమలు కోసం జిల్లా గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, వ్యవసాయ, మండల పరిషత్ అధికారులు సన్నాహాలు మొదలుపెట్టారు.

లబ్ధిదారుల ఎంపిక ఇలా

యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,38,856 కుటుంబాలు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు. వలిగొండ మండలంలో అత్యధికంగా 12,688 కుటుంబాలు, మోత్కూరు మండలంలో అత్యల్పంగా 3302 కుటుంబాలు జాబ్ కార్డులు కలిగి ఉన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 54,365 కుటుంబాలు 20రోజుల పనిదినాలు పూర్తి చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ నెల 15వ తేదీలోగా గ్రామాల వారీగా జాబితాను సిద్ధం చేస్తారు. 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సిద్ధం చేసిన జాబితాలోని వ్యవసాయ కూలీలకు గ్రామంలో లేదా ఇతర చోట్ల ఎక్కడైనా భూమి ఉన్నదా అనే విషయంపై ఆరా తీస్తారు. 21 నుంచి 25వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను గుర్తిస్తారు. జనవరి 25వ తేదీన సాయంత్రం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం పొందడం జరుగుతుంది. ప్రభుత్వం ప్రకటించిన విధంగా జనవరి 26 నుంచి పథకం అమలులోకి వస్తుంది. ప్రభుత్వం మొదటి విడతలో రూ.6వేలు, రెండో విడతలో మరో రూ. 6వేలను కుటుంబ యజమానికి ఖాతాలో నేరుగా జమ చేస్తుంది. జిల్లాలో కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.

పేదల అందరికీ వర్తింపజేయాలి



ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం మంచి పథకం. పేద కుటుంబాలకు నిజంగా భరోసా ఇస్తుంది. భూమిలేని వ్యవసాయ కూలీలందరికీ పథకం వర్తింపజేయాలి. ఉపాధిహామీ జాబ్‌కార్డు, ఇరవై పనిదినాల నిబంధన సరికాదు. కొంతమంది పూర్తిగా వ్యవసాయ పనులకే వెళ్లేవారు ఉంటారు. కొన్ని కుటుంబాలు పొట్టకూటి కోసం వలస వెళ్తారు. ప్రభుత్వ నిబంధనతో అలాంటి పేదలు నష్టపోతారు.

– జిల్లెల పెంటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు

యాదాద్రి భువనగిరి జిల్లాలో జాబ్ కార్డులు కలిగిన వారి వివరాలు

మండలం	జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలు	ఇరవై పనిదినాలు పూర్తయినవారు
అడ్డగూడూరు	5363	2508
ఆలేరు	6598	1972
ఆత్మకూరు(ఎం)	6753	3071
భువనగిరి	9550	4535
బీబీనగర్	7885	2841
బొమ్మలరామారం	8479	2879
చౌటుప్పల్	10081	3794
గుండాల	7306	3986
తుర్కపల్లి	8111	3457
మోటకొండూరు	6374	2093
మోత్కూరు	3302	1750
నారాయణపురం	11118	5051
పోచంపల్లి	7533	2440
రాజపేట	9851	3344
రామన్నపేట	10,236	3782
వలిగొండ	12,688	4065
యాదగిరిగుట	7628	2797
మొత్తం	1,38,856	54,365

సైబర్ మోసాలపై వినూత్న ప్రచారం





• సోషల్ మీడియా వేదికగా అవగాహన కల్పిస్తున్న పోలీసులు

భువనగిరిటౌన్: సైబర్ నేరగాళ్లకు చెక్ పెట్టేందుకు పోలీస్ శాఖ నడుం బిగించింది. సైబర్ నేరాలపై సోషల్ మీడియా వేదికగా పోలీస్ శాఖ వినూత్నంగా ప్రచారం చేస్తోంది. డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్, పార్ట్‌టైమ్ జాబ్స్ పేరుతో బాధితుల కష్టార్జితాన్ని కేటుగాళ్లు కొల్లగొట్టేస్తున్నారు. ఇటీవల ఐవీఆర్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్) కాల్స్ ద్వారా కూడా డబ్బులు దోచేస్తున్నారు. దీనిపై ప్రజలకు అవగాహన లేకపోవటంతో కేటుగాళ్ల పని సులువు అవుతోందని పోలీసులు భావిస్తున్నారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించి వచ్చే ఐవీఆర్ కాల్స్‌కు స్పందించకపోవటం ఉత్తమని పోలీసులు పేర్కొంటున్నారు. అనుమానం వస్తే తక్షణమే సంబంధిత బ్యాంక్ బ్రాంచ్‌కు లేదా ఆ బ్యాంకు హెల్ప్ లైన్స్‌నంబర్ ఫోన్ చేసి అనుమానాలు నివృత్తి చేసుకోవటం ఉత్తమమని చెబుతున్నారు. ఏదైనా మోసపు లావాదేవీలు జరిగితే వెంటనే సంబంధిత యాప్‌లోని హెల్ప్ అండ్ సపోర్ట్ ఆప్షన్‌పై క్లిక్ చేసి ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. ఫోన్లలో గుర్తుతెలియని నంబర్లను బ్లాక్ చేస్తే ఈ తరహా మోసాల బారిన పడకుండా తప్పించుకోవచ్చని పేర్కొంటున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

పెద్దవూర: అక్రమంగా నిల్వ ఉంచి తరలించటానికి సిద్ధంగా ఉన్న 22 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు పెద్దవూర ఎస్‌ఐ పి. వీరబాబు సోమవారం తెలిపారు. పెద్దవూర మండలం ఊట్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గేమ్యానాయక్‌తండాకు చెందిన సపావత్ రవి పీడీఎస్ బియ్యాన్ని ప్రజల నుంచి కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ చేసి రాత్రికి తరలించటానికి సిద్ధం అవుతున్నట్లు తమకు పక్కా సమాచారం అందినట్లు తెలిపారు. దీంతో ఊట్లపల్లి గ్రామానికి వెళ్లి తనిఖీలు చేయగా పాడుబడిన ఇంట్లో 18 క్వింటాళ్లు, కొట్టి అంజయ్య ఇంట్లో 4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచాడు. వీటిని గ్రామంలోని పలువురు నుంచి కొనుగోలు చేసినట్లు, ఒక దగ్గర నిల్వ ఉంచి రాత్రి సమయాలలో తరలిస్తున్నట్లు పేర్కొన్నాడు. 22 క్వింటాళ్ల బియ్యాన్ని స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి, నిందితుడు రవిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని ఎవరైనా విక్రయించినా, కొనుగోలు చేసినా చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జింక్ లోపం నివారిస్తేనే అధిక దిగుబడులు



దిగుబడులపై ప్రభావం

గుర్రంపోడు: పంటల పోషకాల యాజమాన్యంలో సేంద్రియ ఎరువుల వినియోగం తగ్గిపోతుండటంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రసాయన ఎరువుల్లో ముఖ్య పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ ఉండటం, సూక్ష్మపోషకాలు లేకపోవడం వల్ల దీర్ఘకాలికంగా రసాయన ఎరువుల మీద ఆధారపడి సాగు చేసే నేలల్లో సూక్ష్మపోషకాల లోపాలు ఏర్పడతాయి. తక్కువ పరిమాణంలోనే అవసరమయ్యే జింక్, బోరాన్, మెగ్నీషియం తదితర పోషకాలు పైరు ఎదుగుదలకు, మంచి దిగుబడులకు దోహదపడతాయి. యాసంగి వరి మాగాణుల్లో ఎక్కువగా ఏర్పడే ముఖ్యమైన జింక్ లోప నివారణకు వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి సలహాలు ఆయన మాటల్లోనే..

వరిలో జింక్ లోపానికి కారణాలు

వరిలో జింకు లోపం అధికంగా రావడానికి ముఖ్య కారణం సేంద్రియ ఎరువుల వినియోగం తక్కువగా ఉండటం, వరి సాగుకు ముందు పెసర, అలసంద, జీలుగ లాంటి పచ్చిరొట్ట పైర్లను సాగు చేసి నేలలో కలియ దున్నుతున్నారు. ఇది మినహా సేంద్రియ ఎరువుల వినియోగం వరిలో అత్యధిక విస్తీర్ణంలో లేనట్లే. వరిలో జింక్ లోపం ఏర్పడటానికి మరో ముఖ్య కారణం వరిసాగు చేసే నేలల్లో చౌడు ఉండటం. చౌడు వల్ల నేలల్లో ఉన్న జింకు మొక్కలకు సులభంగా అందుబాటులోకి రాక పైరులో జింకు లోపం ఏర్పడుతుంది. ఈ కారణాలే కాక రసాయనిక ఎరువులు సమతుల్యంగా వాడనప్పుడు, మురుగు నీరు సరిగా బయటకు వెళ్లని నేలల్లో సాగు చేసినప్పుడు వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గినప్పుడు కూడ వరిలో జింకు లోపం కనిపిస్తుంది.

జింకు లోపం ఉంటే ఏ పంటలోపైనా రసాయన ఎరువులు తీసుకునే శక్తి తగ్గిపోయి వేసిన ఎరువులు వధా అవుతాయి. వరిలో వచ్చే జింకు లోపం పంట పెరుగుదల, దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. జింకు లోపం ఉన్నప్పుడు నాటిన పైరు అనారోగ్యంగా కనిపిస్తుంది. పిలకలు తక్కువగా ఆలస్యంగా వస్తాయి. అంతేగాక వచ్చిన పిలకలు సరిగా పెరగక పైరు కశించినట్లు , గిడసబారి కనిపిస్తుంది. లేత ఆకులు ఈనెల మధ్య భాగం పసుపు రంగులోకి మారిపోయి, పైరు కళ తప్పి కనిపిస్తుంది. జింకు లోపం తీవ్రత అధికంగా ఉన్న చోట్ల అడుగు ఆకులు ఎండిపోతాయి. ఈ విధంగా పైరు పెరుగుదలకు ఇబ్బంది కలిగి దిగుబడులు తగ్గుతాయి. జింకు ధాతు లోపం ప్రతి ఏటా పెరుగుతూ వస్తుంది. కాల క్రమేణా పంటల పోషకాల యాజమాన్యంలో వచ్చిన మార్పులు దీనికి కారణం . వరి సాగులో దిగుబడులు తగ్గకుండా ఉండటానికి సరైన జింకు పోషక యాజమాన్యాన్ని ఆచరించాలి.

వరి నాటిన తర్వాత..

దమ్ములో జింకు సల్ఫేట్ వేయని పొలాల్లో పైరుపై జింకు సల్ఫేట్ పిచికారీ చేసి కూడ జింకు లోపాన్ని నివారించుకోవచ్చు. వరి నాటిన 20 రోజులకు ఒక సారి, మళ్లీ వారం వ్యవధిలో మరోసారి ఎకరానికి 400 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేయాలి. పదిహేను రోజుల వ్యవధిలో మరోదఫా ఇదే మోతాదును పిచికారీ చేసుకోవాలి. జింకు సల్ఫేట్‌ను వరి పొలంలో పిచికారీ చేసేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పురుగు మందులు లేదా తెగుళ్ల మందులతో కలిపి పిచికారీ చేయకూడదు. చౌడు నేలల్లో జింకు సల్ఫేట్‌ను దమ్ములో వేయడం కంటె రెండు ధపాలుగా పిచికారీ చేసుకోవడం లాభదాయకం.

నివారణ చర్యలు

జింకులోప నివారణకు అన్నింటికంటే మొదట చేయాల్సింది పంటకు అవసరమైన పోషకాల్లో కనీసం 30 శాతం సేంద్రియ ఎరువుల ద్వారా అందించాలి. పశువుల ఎరువును తప్పనిసరిగా తోలించడం, ఇతర జీవన ఎరువులను వాడటం చేయాలి. సేంద్రియ ఎరువులు వినియోగించడానికి వీలు కానప్పుడు వరి నాటడానికి ముందు ఎకరాకు 20 కిలోల వంతున జింకు సల్ఫేట్ దమ్ములో వేసి పైరులో జింకు లోపం ఏర్పడకుండా నివారించుకోవచ్చు. ఎట్టి పరిస్థితుల్లోనూ జింకు సల్ఫేట్ దమ్ములో వేసినప్పుడు భాస్వరపు ఎరువులలో కలిపి వేయరాదు. జింకు సల్ఫేట్ వేయడానికి ముందు, తర్వాత రసాయన ఎరువులు వేయడానికి నాలుగు రోజల విరామం ఉండాలి. జింకు సల్ఫేట్‌ను ఖరీఫ్, రబీ పంటలకు కలిపి ఒక సారి వేస్తే సరిపోతుంది.

ఆక్రమణలో పోస్టాఫీస్ స్థలం

• అద్దె భవనంలో కొనసాగుతున్న తపాలా కార్యాలయం
• ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, ప్రజలు
• నూతన భవనం నిర్మించాలని కోరుతున్న కోదాడ పట్టణవాసులు



పార్కింగ్ స్థలంగా మార్చుకున్న పోస్టాఫీస్ స్థలం

కోదాడ: కోదాడ పట్టణం నడిబొడ్డున ఎంతో విలువైన పోస్టాఫీస్ స్థలం ఆక్రమణకు గురవుతోంది. అదే సమయంలో ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న పోస్టాఫీస్‌తో ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. పోస్టాఫీస్‌కు కొత్త భవనం నిర్మించాలని అనేక సంవత్సరాలుగా చేస్తున్న విజ్ఞప్తులు బుట్టదాఖలవుతున్నాయి. ఇప్పటికే పోస్టాఫీస్ ముందు ఉన్న స్థలం డబ్బా కొట్లతో మూసివేయగా వెనుక వైపు ఉన్న స్థలాన్ని సమీపంలోని వ్యాపార సంస్థల నిర్వాహకులు పార్కింగ్ స్థలంగా మార్చుకున్నారు. మరోవైపు వ్యాపార భవనాన్ని నిర్మించిన కొందరు తమ స్థలం ఉందని అందులోనే మెట్ల నిర్మాణం చేపట్టారు. కొద్దిరోజులు పోతే అక్కడ పోస్టాఫీస్ స్థలం ఉన్నదనే విషయం కూడా మర్చిపోయే ప్రమాదముందని పలువురు అంటున్నారు.

30 సంవత్సరాలుగా అద్దె భవనంలోనే...

కోదాడ పట్టణంలో పోస్టాఫీస్‌కు శాశ్వత భవనం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో పట్టణంలోని మసీద్ సమీపంలో జాతీయ రహదారిపై పోస్టాఫీస్ ఉండేది. ఇది శిథిలావస్థకు చేరుకోవడంతో దాన్ని కూల్చివేసి కొత్త భవనం నిర్మిస్తామని పోస్టాఫీస్‌ను అద్దె భవనంలోకి మార్చారు. ఇది జరిగి 30 సంవత్సరాలు కావొస్తుంది. అప్పటి నుంచి భవన నిర్మాణం అంగుళం కూడా కదలలేదు. మొదట నయానగర్‌లో ఏర్పాటు చేసిన పోస్టాఫీస్‌ను అక్కడి నుంచి మార్చి మున్సిపాలిటీ కార్యాలయం వెనుకకు మార్చారు. అక్కడి నుంచి ప్రస్తుతం భవానీనగర్‌కు మార్చారు. నివాస గృహాల మధ్య పోస్టాఫీస్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో పార్కింగ్ లేక కార్యాలయానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తవారికి ఈ కార్యాలయం అడ్రస్ కనుక్కోవడం పెద్ద టాస్కే. పోస్టాఫీస్‌కు పాత స్థలంలో కొత్త భవన నిర్మాణం చేస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లినా..

పోస్టాఫీస్‌కు సొంత భవనం నిర్మాణం చేయాలని కోదాడకు చెందిన ఎన్‌ఆర్‌ఐ జలగం సుధీర్ కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని ఆయనకు మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఇది జరిగి రెండు సంవత్సరాలు అవుతున్నా భవన నిర్మాణ విషయంలో ఎలాంటి పురోగతి లేదు.